క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామ శివారు రంగాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం ఉదయం పది గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హుసేన్ శుక్రవారం తెలిపారు. గ్రామస్తులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలు, బాధితులకు ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. సదస్సుకు సీఐడీ అడిషనల్ ఎస్పీ ప్రసాద్ హాజరుకానున్నట్లు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

నందిగామ టౌన్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని ఇన్చార్జ్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అభివృద్ధి ప్రణాళిక తయారీ, ఆయా శాఖల నిధుల సమీకరణ, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పిచ్చయ్య, మండల పరిషత్ కార్యాలయ అధికారులు రాఘవశర్మ, నాగలక్ష్మి, మనీషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

నందిగామ టౌన్: మండలంలోని లచ్చపాలెం గ్రామంలోని వృద్ధాశ్రమానికి చవట వెంకటనర్సమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు చవట నాగేశ్వరరావు కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారం అమరయ్య, డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళాలు



పెనుగంచిప్రోలు(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు, శ్రీ స్వయంభు శంభు లింగేశ్వరస్వామి వార్ల ఆలయాలకు శుక్రవారం దాతలు విరాళాలు అందజేశారు. శంభులింగేశ్వరస్వామి వారి ఆలయానికి గ్రామానికి చెందిన నల్లూరి అప్పారావు, తిరుపతమ్మ దంపతుల కుమారుడు వరుణ్‌కుమార్, దివ్య దంపతులు నూతన ఆలయ నిర్మాణం కోసం రూ 1,0,1116 అందజేయగా, గోసంరక్షణ కోసం తిరుపతమ్మ ఆలయానికి ఖమ్మం జిల్లా బోనకల్ మండలం, తూటికుంట గ్రామానికి చెందిన పాపినేని అప్పారావు, మోనా దంపతులు రూ.10,116 లను అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి బెనర్జి, గజ్జి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

నందిగామ టౌన్: ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కాంట్రాక్టర్ కృష్ణప్రసాద్ సక్రమంగా వేతనాలు అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందిపడుతున్నారని సీఐటీయయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందించడంతోపాటు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులతో కలిసి శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కార్మికుల వద్ద నుంచి పీఎఫ్, ఈఎస్ఐ తదితరాలను వేతనాల నుంచి కట్ చేస్తున్నారని కార్మికులకు మాత్రం వాటికి సంబంధించిన కార్డులు ఇంత వరకు అందించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కరి వెంకటేశ్వరరావు, కార్మికులు ప్రభుదాస్, ఏసమ్మ, ఏసుబాబు, ఇస్రాయిల్, లింగమ్మ, పద్మ పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక మాయం!

కంచికచర్ల : మండలంలోని మోగులూరులో ఇటీవల అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను అధికారులు పట్టుకుని రీచ్ సమీపంలో డంప్ చేశారు. ఇసుకను సీజ్ చేసి స్థానిక వీఆర్వోకు అప్పగించారు.సుమారు 160 టన్నుల వరకు ఉంటుందని అంచనా. కాని అధికారులు పట్టుకున్న ఇసుకను వేలం వేయలేదు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్ నుంచి నాలుగు లారీల మేర ఇసుకను కొందరు వ్యక్తులు తరలించారు. అధికారుల కనుసన్నలలోనే కూటమి నాయకులు ఈ ఇసుకను అక్రమంగా తరలించినట్లు గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం వీఆర్వోకు కూడా తెలుసని సమాచారం. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి మోగులూరు గ్రామంలో సమగ్ర విచారణ చేపట్టి సీజ్ చేసిన ఇసుకను తరలించినవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

సర్వం శివకేశవం

● ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు ● వెల్లివెరిసిన ఆధ్యాత్మిక శోభ



కంచికచర్లలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో దర్శనమిస్తున్న నరసింహారావుపాలెంలోని అమరలింగేశ్వరస్వామి



జగ్గయ్యపేట పెద్ద శివాలయంలో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో దర్శనమిస్తున్న దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి



వత్సవాయిలో హరిహరుల కల్యాణం



పరిటాలలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు



నందిగామలో జ్వాలాతోరణంను తిలకిస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న నందిగామ రామలింగేశ్వరస్వామి వారి ఆలయం

నందిగామటౌన్: కార్తిక పౌర్ణమి సందర్భంగా నందిగామ, చందర్లపాడు మండలాల్లోని శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిళ్వ, పుష్పార్చన, తదితర అభిషేకాలు, హోమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నందిగామలోని రామలింగేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి వారి ఆలయాలతోపాటు మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, పల్లగిరి, రాఘవాపురం గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. మహిళలు కృష్ణానది, మున్నేరు, వైరా ఏటిలో పుణ్య స్నానాలాచరించి ఆయా ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకుని కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల శివనామస్మరణ నడుమ జ్వాలాతోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు రావటంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నందిగామ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో సీఐ వైవిఎల్ నాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ అభిమన్యు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. నందిగామలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

చందర్లపాడు మండలంలో..

కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలు, ఇతర ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పుణ్య స్నానాలాచరించి వేకువజామునే కార్తిక దీపాలు వెలిగించారు. రాత్రికి ఆయా ఆలయాల్లో జ్వాలాతోరణం నిర్వహించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో పలు శైవక్షేత్రాలు ,ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జగ్గయ్యపేటలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్దశివాలయం), మఠం శివాలయం, శ్రీమహాలక్ష్మిఅమ్మవారి వెండి దేవాలయం, నకాశిబ జారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయాలలో భక్తులు పూజలు చేసి కార్తిక దీపాలను వెలిగించారు. విజయవాడ రోడ్డులోని శ్రీసంతానవేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అన్ని ఆలయాలలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు.

శ్రీగురుధాంలో ..

జగ్గయ్యపేట మండలం బలుసుపాడు శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల వారికి రుద్రాభిషేకం , నన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం మీనాక్షి, సుందరేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త గెంటేల వెంకటరమణ అనుగ్రహ భాషణం చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: కార్తికపౌర్ణమి పర్వదినాన్ని శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే సాన్నామాచరించి శివాలయాలకు చేరుకుని స్వామివార్లకు పూజలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించారు. లింగాల వద్ద మునేటిలో, ముక్త్యాల, వేదాద్రిల వద్ద నదీస్నానాలు చేశారు. మండలకేంద్రం వత్సవాయిలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఒకే వేదికపై హరిహరుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలో ఆధ్యాత్మికశోభ వెల్లివెరిసింది. గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహారావుపాలెంలోని బాలచాముండేశ్వరీదేవి సమేత అమరలింగేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: కార్తిక పౌర్ణమి సందర్భంగా కంచికచర్లతో పాటు మండలంలోని అన్ని శైవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చలిని సైతం లెక్క చేయకుండా భక్తులు వేకువజామునే తలంటు స్నానమాచరించి ఆలయాలకు చేరుకుని స్వామివార్లకు పూజలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. కంచికచర్ల పాత శివాలయంలో సంగమేశ్వరస్వామికి, కన్యకాపరమేశ్వరి ఆలయం, మహాలక్ష్మి ఆలయం, రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మున్నలూరు, కునికెనపాడు, పరిటాల, గొట్టుముక్కల, గండేపల్లి, కీసర, పెండ్యాల, వేములపల్లి మోగులూరు తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పేటలో మంచినీటి వ్యవస్థ అస్తవ్యస్తం : తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ మంచినీటి సరఫరా విభాగం పనితీరు అధ్వానంగా ఉండటంతో పట్టణ ప్రజలకు సజావుగా తాగునీరు అందడం లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ హెడ్‌వాటర్ వర్క్స్ పంప్‌హౌస్‌లో మోటార్లు, పైపులైన్ల పనితీరు, క్లోరినేషన్ వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఏదైనా మోటార్ చెడిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. కృష్ణాజలాలు పట్టణానికి పూర్తిస్థాయిలో రావడం లేదని, అందుకు ప్రస్తుత కౌన్సిల్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఒక్క మోటారు ద్వారా 50 శాతం మాత్రమే కృష్ణా జలాలు వస్తున్నాయని, మిగిలినవి పాలేటి నీరు వస్తుందన్నారు. ఈవిషయంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మున్సిపల్ పాలకవర్గం, చైర్మన్ రాఘవేంద్రకు, పేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)పై ఉందన్నారు. నీటిని నాలుగు రోజులుగా క్లోరినేషన్ చేయకుండానే ప్రజలకు సరఫరా చేస్తుండటంతో డయేరియా ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కాలిపోయిన జనరేటర్‌స్థానంలో కొత్త జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ప్యూరిఫైడ్‌నీరు భారీగా లీకేజీకి గురవుతూ వృథాగా పోతోందన్నారు. ఎయిర్ వాల్వ్ లీకులను అరికట్టాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పనితీరు కొద్దినెలలుగా సరిగా లేదని విమర్శించారు. ఎమర్జెన్సీ వర్కుల పేరుతో సాగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, ఆపార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బద్దూనాయక్, సర్పంచ్ సూరిబాబు, నాయులు పింగళి నరసింహరెడ్డి, గోగుల వెంకయ్య, హుస్సేన్ ఉన్నారు.



హెడ్‌వాటర్ వర్క్స్‌లో పలు విభాగాలను పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

కనుల పండువగా నదీహారతి

పెనుగంచిప్రోలు(వత్సవాయి): కార్తిక పౌర్ణమి సందర్భంగా పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మునేరులో నదీ హారతి కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను పల్లకీపై ఉంచి రజకులు మోసుకుంటూ మునేరులో ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంపై ఉంచి వేదపండితులు, అర్చకులు వేద పఠనం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈవో కిషోర్‌కుమార్ నదిలో గంగకు చీర, జాకెట్, పూలు, గాజులు వాయినం సమర్పించి నదీ హారతులు ఇచ్చారు. భక్తులు అరటిదొప్పల్లో ఒత్తులు వెలిగించి నదిలో వదిలారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్ రమ, ఏఈఓ జి.ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు , అరవింద్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



నదీహారతి ఇస్తున్న అర్చకులు

హైవేపై అక్రమ డివైడర్ మూసివేత

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై ఫుడ్ ప్లాజా ఎదురుగా అక్రమంగా ఏర్పాటు చేసిన డివైడర్‌ను సీఐ పి.వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ జి.రాజు శుక్రవారం పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ నాలుగేళ్లలో ఈ ప్రాంతంలో 16 ప్రమాదాలు చోటుచేసుకోగా, 8మంది మృతిచెందారన్నారు. భవిష్యత్‌లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా నేషనల్ హైవే అథారిటీ వారితో మాట్లాడి వెంటనే జెర్సీ బ్లాక్‌లతో డివైడర్‌ను మూసివేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇది ఓపెన్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. షేర్‌మహ్మద్‌పేట, ఆటోనగర్ వెళ్లాల్సినవారు అండర్‌పాస్ ద్వారా వెళ్లాలని, తద్వారా ఇక్కడ ప్రమాదాలు జరగకుండా సహకరించాలని సీఐ కోరారు.



క్రీస్తు మార్గం ఆచరణీయం

ముక్త్యాల(జగ్గయ్యపేట అర్బన్): దేవుని మందిరాలు ప్రజల భక్తి విశ్వాసాలను పెంపొందిస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముక్త్యాలలో నూతనంగా నిర్మించిన షారోన్ క్రీస్తు ప్రార్థనామందిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చర్చి నిర్మాణ కమిటీ సభ్యులంతా కలిసి తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు ఆచరించి చూపిన శాంతిమార్గం ఆచరణీయమని పేర్కొన్నారు. పాస్టర్లు ఏలైజు, జాకోబు, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు, సంఘస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామసులు పాల్గొన్నారు.



చర్చి ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

తుదిదశకు చేరుకున్న పనులు



నిర్మాణం పూర్తయిన కల్యాణ మండపం



నిర్మాణం పూర్తయిన మినీ ఫంక్షన్‌హాల్స్

- రూ.13 కోట్లతో పనులు..
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు
- త్వరలో అందుబాటులోకి రానున్న సదుపాయాలు

పెనుగంచిప్రోలు: రెండు తెలుగు రాష్ట్రాల్లో భక్తుల పాలిట కొంగు బంగారంలా విలసిల్లుతున్న పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.13కోట్లతో ఈ పనులు చేపట్టారు. త్వరలో భక్తులకు వసతులు అందుబాటులోకి రానున్నాయి. తిరుపతమ్మవారి దర్శనానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తారు. పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఏడాదికి 50 లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. వారికి సరైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో 2023 నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఆ పనులు మొత్తం పూర్తయి ప్రారంభానికి సిద్ధమయ్యాయి.



ప్రారంభానికి సిద్ధమైన ఏసీ గదులు

సిద్ధంగా ఉన్న సౌకర్యాలు .

– మునేరు అవతల అమ్మవారి మామిడి తోటలో భక్తుల సౌకర్యం కోసం రూ.3.70 కోట్లతో చేపట్టిన కల్యాణ మండపం, ఏసీ గదులు, రెండు ఫంక్షన్ హాళ్ల నిర్మాణం పూర్తయింది. మరో తోటలో రూ.1.50 కోట్లతో నాలుగు మినీ ఫంక్షన్ హాల్స్, గదులు నిర్మించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న మునేరు పక్కన రూ.2.10 కోట్లతో సిమెంట్ రోడ్డు, డ్రెయిన్, ప్రహరీ నిర్మాణం పూర్తయింది.



ప్రారంభానికి సిద్ధమైన షెడ్లు

విశాలమైన డార్మిటరీ నిర్మాణం..

ఆలయం పక్కన రూ.4.50 కోట్లతో కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్ నిర్మాణం పూర్తికావస్తోంది. హైదరాబాద్‌కు చెందిన దాత సాయంతో సుమారు రూ.కోటితో విశాలమైన డార్మెటరీ నిర్మిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల నుంచి మునేరు అవతల మామిడి తోటల వారు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఆలయం వారు మామిడి తోటల్లో నిర్మించిన కల్యాణమండపం, గదులు, షెడ్లు తక్కువ ధరకు అందిస్తే సౌకర్యంగా ఉంటుందని భక్తులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం ..

మామిడి తోటల్లో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. స్థలం మొత్తం గ్రావెల్‌తో చదునుచేసి, ఎలక్ట్రిఫికేషన్ చేస్తున్నాం. వాటర్ ట్యాంక్‌లు, వంట షెడ్లు ఏర్పాటు చేస్తున్నాం. నెల రోజుల్లో అవి కూడా పూర్తవుతాయి.

– ఎల్.రమ, ఆలయ ఈఈ

త్వరలో అందుబాటులోకి ..



మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో నిర్మించిన కల్యాణ మండపం, ఏసీ గదులు మినీ ఫంక్షన్‌హాల్స్ తదితర పనులు పూర్తయ్యాయి. కొద్ది రోజుల్లో ప్రారంభిస్తాం. ఆలయం వద్ద అభివృద్ధి పనులు కూడా తుది దశకు వచ్చాయి.

-భూపతిరాజు వెంకట నాగ కిషోర్‌కుమార్, ఆలయ ఈఓ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చాట్రాయి: మర్లపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో మర్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన హర్షిత, కె. పవిత్ర రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు బక్కయ్య, పీడీ సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.